ప్రజాశక్తి

సోమవారం 7 జూలై 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

డ్రగ్స్ పడగ నీడలో విశాఖి



- గుట్టుచప్పుడు కాకుండా మత్తు ఇంజక్షన్లు, టాబ్లెట్లు, కొకైన్ విక్రయాలు
- యువత లక్ష్యంగా అమ్మకాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

డ్రగ్స్ మాఫియాకు విశాఖ వేదిక అయిందా ? అంటే అవుననే సమాధానమే వస్తోంది. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఇక్కడే ఉంటున్నాయి. ప్రముఖ నగరంగా, జల, వాయు, రోడ్డు సదుపాయాలు కలిగిన ఉత్తమ ప్రాంతంగా విశాఖ ఉండటం మాఫియాను ఆకర్షిస్తోంది. దీంతో విక్రయాలపై దృష్టి పెట్టి యువతను లక్ష్యంగా చేసుకుని నగరాన్ని మత్తులోకి నెడుతున్నారు. కోట్ల రూపాయల సరుకు నిత్యం నగరంలో రవాణా అవుతోంది.

గంజాయి, లిక్విడ్ గంజాయి, మత్తు ఇంజక్షన్లు, టాబ్లెట్లు, కొకైన్, హెరాయిన్ మాదక ద్రవ్యాలు విశాఖ మీదుగానే రవాణా అవుతున్నాయి. గంజాయి ప్రతి రోజూ పట్టుబడుతోంది. నిందితులు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా చిక్కుతున్నారు. బ్రెజిల్, దక్షిణాఫ్రికాల నుంచి విశాఖకు డ్రగ్స్ ఎక్కువగా సరఫరా అవుతున్నాయి. ఎయు, గీతం యూనివర్సిటీల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయదారులు అమ్మకాలు

(మిగతా 2లో..)

తాజా కేసులో మరో వ్యక్తి అరెస్ట్

విశాఖ నగరంలో శనివారం సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో మరొక వ్యక్తిని ఆదివారం అరెస్టు చేశారు. దీంతో నిందితుల సంఖ్య మూడుకు చేరింది. కేసు వివరాలను ఈస్ట్ ఎసిపి లక్ష్మణమూర్తి మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. శనివారం వేకువజామున ఆంధ్ర యూనివర్సిటీ మైదానం వద్ద ఈగల్, విశాఖ సిటీ పోలీసులు మాటువేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి 25 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ కేసు తదుపరి విచారణలో మరిన్ని ఆధారాలు లభించాయన్నారు. దీంతో ఆదివారం విశాఖలోని కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన ఖమ్మెళ్ల శ్రీకృష్ణ చైతన్య వర్మను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ఒక బృందం ప్రధాన నిందితులను అరెస్టు చేసేందుకుగాను ఢిల్లీ వెళ్లిందని తెలిపారు. మీడియా సమావేశంలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పైడయ్య పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి

భక్తిశ్రద్ధలతో మొహరం

ప్రజాశక్తి - విశాఖపట్నం, సీతమ్మధార, నక్కపల్లి విలేకరులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మొహరం పండగను ముస్లిములు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విశాఖ నగరంలోని ఓల్డ్ టౌన్ ఏరియాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. జివిఎంసి 53వ వార్డు పరిధి డాక్టర్ జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జీద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో హఫీజ్ (ముస్లిం మత గురువు) తక్రిర్ పఠించారు. పాలు, బెల్లం, పుట్నాలతో తయారుచేసిన ప్రత్యేక పానీయాన్ని స్థానికులకు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మసీదు కమిటీ అధ్యక్షులు మున్నా పర్యవేక్షించారు.

నక్కపల్లి మండలంలోని పెద బోదిగల్లం, అప్పల పాయకరావు పేట, పెద దొడ్డిగల్లు గ్రామాల్లో మొహరం పర్వదినాన్ని పురస్కరించుకొని గుమ్మటాలను వస్త్రాలతో అలంకరించి వీధుల్లో ఊరేగించారు.



గుమ్మటాలను ఊరేగిస్తున్న ముస్లిములు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

వార్త 2లో..

పాత, కొత్త వార్డులతో గందరగోళం

వార్త 4లో..

ప్రజలను మమేకం చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం

వార్త 2లో..



రాంబిల్లి నేవీ గేట్ వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న లోకనాథం

సమ్మె జయప్రదానికి విస్తృత ప్రచారం

-పలుచోట్ల జాతాలు, సమావేశాలు

వార్తలు 7లో..

అందుబాటులో ఎరువులు

- అర్హులందరికీ పంట రుణాలు
- 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు

ప్రజాశక్తి - అనకాపల్లి

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్ని రకాల ఎరువులూ సిద్ధంగా ఉన్నట్టు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. వ్యవసాయ సీజన్ నడుస్తున్న నేపథ్యంలో ఆయన్ని 'ప్రజాశక్తి' పలకరించగా జిల్లాలో మొత్తం పంటల విస్తీర్ణత, ఎరువుల లభ్యత, వివిధ పంటలకు ఇస్తున్న బ్యాంకు రుణాల విషయాలను తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వివిధ పంటల సాధారణ విస్తీర్ణమెంత ? ప్రస్తుతం ఏ మేరకు పంటలు వేశారు ?

అనకాపల్లి జిల్లాలో ప్రధానమైన వరి పంట సాధారణ విస్తీర్ణం 54 వేల 465 హెక్టార్లు. ఇంకా రైతులు తమ పొలాల సన్నద్ధతలో ఉన్నారు. మొత్తం ఆహార ధాన్యాల సాధారణ విస్తీర్ణం 55 వేల 916 హెక్టార్లలో ఇతర పంటలు ఒక శాతం మాత్రమే వేస్తున్నారు.

చెరుకు పరిస్థితి ఏంటి ?

జిల్లాలో చెరుకు సాధారణ విస్తీర్ణం 14 వేల 612 హెక్టార్లు. గత ఏడాది



ఇదే సమయానికి 3943 హెక్టార్లలో వేయగా ఈ ఏడాది కేవలం



2064 హెక్టార్లలో మాత్రమే వేశారు. క్రమేపీ ఈ పంట విస్తీర్ణం తగ్గుతోంది. నూనె గింజల పంటల సాధారణ విస్తీర్ణం 768 హెక్టార్లకుగాను 304 హెక్టార్లలో వేశారు.

రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయా ?

ఖరీఫ్

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

డ్రగ్స్ పడగ నీడలో విశాఖ

జరుపుతున్నారు.

విస్తుగొలిపే వాస్తవాలు

డ్రగ్స్, గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా దందాకు అడ్డుకట్టవేస్తామని గత వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు చెప్పిన మాటలు ఆచరణ రూపం దాల్చలేదు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని ఉమ్మడి విశాఖకు చెందిన హోం మంత్రి వంగలపూడి అనిత గత ఏడాది నుంచీ చెబుతున్నా ఆ తీరున కార్యాచరణ లేదు. విశాఖలోని పర్యాటక ప్రాంతాల్లో డ్రగ్స్ రవాణా కొత్త రూపాల్లో జరుగుతోంది. లావాదేవీల కోసం నిందితులు క్రిప్టో కరెన్సీ, యుపిఐ పేమెంట్స్, హవాలా పద్ధతులు అవలంబిస్తున్నారు. వారు డార్క్ వెబ్‌ను వేదికగా చేసుకున్న ఉదంతాలూ ఉన్నాయి. గతంలో విశాఖ ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ అమ్ముతున్నారనే సమాచారంతో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెలలో కేసులు నమోదయ్యాయి.

అందుబాటులో ఎరువులు

సీజన్‌కుగాను జిల్లాలో మొత్తం 35,353 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంకాగా ఇంతవరకూ 595 మెట్రిక్ టన్నులు సరఫరా చేశాం. 9648 మెట్రిక్ టన్నులను అందుబాటులో ఉంచాం. ప్రధానంగా యూరియా, డిఎపి, ఎంఒపి, ఎన్‌టిపి, ఎస్ఎస్‌పి, కంపోస్టు ఎరువులను అందుబాటులో ఉంచాం. ఇవి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, ఆర్ఎస్‌కెల వద్ద అందుబాటులో ఉన్నాయి.

రైతులకు కావాల్సిన పంట రుణాలు ఇస్తున్నారా ?

జిల్లాలో ప్రధాన పంటలైన వరి, చెరుకుతోపాటు ఇతర పంటలకు కూడా స్కేల్ ఫైనాన్స్ ప్రకారం వివిధ బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తున్నారు. ఇరిగేటెడ్ పంట పొలాలకు ఎకరాకు రూ.50 వేలు, అన్ ఇరిగేటెడ్ పొలాలకు రూ.40 వేలు చొప్పున అందిస్తున్నాం. గత ఏడాది జాయింట్ లయబులిటీ గ్రూపులు కింద 54 గ్రూపులకు గ్రూపునకు లక్ష రూపాయలు చొప్పున రుణాలను ఇచ్చాం. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

కౌలు రైతుల్లో ఎంతమందికి కార్డులు ఇచ్చారు ?

జిల్లాలో 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో 5200 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చాం. ఈ ఏడాది ఆరు వేల మందిని లక్ష్యంగా చేసుకున్నాం. ప్రస్తుతం 1536 మందిని గుర్తించాం.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రాలను నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ద్వారా విశాఖ నగర వాసులకు అందుబాటులోకి తెచ్చారు. హోటల్ గ్రీన్ పార్కు శనివారం నుంచి దీనికి వేదికైంది. ఈ నెల 9 వరకు సాగే ఎక్స్‌పోలో దేశంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక సంబంధాలను ముడివేసేలా, వివిధ రాష్ట్రాల తెచ్చిన మగ్గాల ఉత్పత్తులను ఒకచోట చేర్చారు. ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇది భారతదేశ నేత సంప్రదాయాల చుట్టూ చేసిన వస్త్రాల యాత్ర లాంటిదని నిర్వాహకులు పేర్కొన్నారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనింగ్ చీరలు, బ్లౌజ్‌లు, కుర్తీలు మొదలైన వాటిని ఇక్కడ ఉంచామన్నారు. 50 శాతం వరకు తగ్గింపుతో వస్త్రాలను ఈ ప్రదర్శనలో విక్రయిస్తున్నామన్నారు. మహారాష్ట్ర వారి సొగసైన స్వచ్ఛమైన పైథానీ సిల్క్ చీరలు, కర్నాటక వారి బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్‌లో ప్రసిద్ధ చెందిన చందేరి, మహేశ్వరి సిల్క్, హ్యాండ్ పెయింట్, బలుచారి, జమ్దానీ, తంగైల్, ఢకై మస్లిన్ సిల్క్ వస్త్రాలు, పశ్చిమ బెంగాల్ వారి లినెన్ చీర, కాంత వర్క్ స్టిచ్ చీరలు తయారీదారుల నుండి నేరుగా సేకరించి, అన్నింటినీ ఒకే చోట అందిస్తున్నామన్నారు. ఎక్స్‌పోలో వివిధ డిజైన్లు, నమూనాలలో చీరలు, దుపట్టాలు, సల్వార్ మెటీరియల్స్ ఉన్నాయన్నారు. తస్సార్, మట్కా, బీహార్ భాగల్పూర్ సిల్క్, గుజరాత్ సాంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా, తమిళనాడు నుండి కంజీవరంతో పాటు ఎంబ్రాయిడరీ సిల్క్, జమ్మూ, కాశ్మీర్ నుండి తాబి సిల్క్ చీరలు ఉన్నాయన్నారు. ఉత్తర ప్రదేశ్ నుండి బనారసి సిల్క్ చీరలు, జమ్దానీ, షిఫాన్ చీరలు, లక్నవి చికాన్ వర్క్, రాజస్థాన్ నుండి బంధిని, బంధేజ్, హ్యాండ్-బ్లాక్ ప్రింట్ చీరలు ఈ ప్రదర్శనలో లభిస్తాయన్నారు. ఈ ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఉంటుందన్నారు. ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు.



అమ్మకానికి ఉంచిన శారీతో మహిళ

వివేకానంద నగర్ పార్క్ అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి - విశాఖపట్నం : జివిఎంసి ఎనిమిదో వార్డు వివేకానంద నగర్ పీపుల్ వెల్ఫేర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వివేకానంద పార్కులో అసోసియేషన్ సభ్యుల సమావేశం జరిగింది. పార్క్ అభివృద్ధి పనులపై ప్రతినిధులు సమీక్షించారు. ఆగస్టు 27న వినాయక చవితి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి ఉదయ్ కుమార్, క్రియాశీల సభ్యులు రామకృష్ణ, రాంబాబు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, పాకా సత్యనారాయణ, శ్రీహరి రాజు, బెనర్జీ, ప్రకాష్, నవీన్, శివ పాల్గొన్నారు.



సమావేశమైన అసోసియేషన్ సభ్యులు

విమల విద్యాలయంపై 'కుట్ర పత్రం' !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 'కుట్రవ్రతం' చేపట్టిందా ? అంటే తాజా పరిణామాలన్నీ అవుననే చెబుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులందరినీ ఎలాగైనా ఒక్కొక్కరిగా బయటకు పంపించేయడం, ఉత్పత్తి విభాగాలన్నింటినీ బలహీనపరచడం, ప్లాంట్‌లోగల కార్మికుల పిల్లలు చదువుకునే విద్యాసంస్థలను బలవంతంగా మూసివేయించడం పనిగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. కేంద్రం డైరెక్షన్‌లో నడుస్తూ ఇక్కడి ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. ఇదంతా మోడీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రూ.11400 కోట్ల ప్యాకేజీ అమలు పేరిట సాగుతున్న కుట్రేనని తేటతెల్లమౌతోంది. జూన్‌లోనే రాష్ట్రంలో విద్యాసంస్థలన్నింటినీ తెరిచినా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన విమల విద్యాలయాన్ని మాత్రం ప్రారంభించకుండా తాత్సారం చేశారు. 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్.బి.గంగారావు చేసిన చొరవతో ఆ పాఠశాలను ప్రారంభిస్తారనుకునేలోపే అధికార టిడిపికి చెందిన విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, స్థానిక గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు సంయుక్తంగా రాసిన లేఖలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. విమల విద్యాలయంలో పనిచేస్తున్న టీచర్లకు విఆర్ఎస్ ఇచ్చి పంపేయాలని సదరు లేఖల్లో వారు సిఫారసు చేయడం చూస్తే వీరు స్టీల్‌ప్లాంట్ రక్షకులా ?



భక్షకులా ? అన్న ప్రశ్న సర్వత్రా ఉద్భవిస్తోంది. విశాఖ విమల విద్యాలయంలో ప్రస్తుతం 1600 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరేగాక మరో 500 మంది విద్యార్థులు గంట్యాడ బ్రాంచిలో విద్యను అభ్యసిస్తున్నారు. 1984 నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కింద కార్మికుల పిల్లల కోసం ఈ స్కూల్స్ నిర్వహిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో స్కూల్ నడిస్తే ఉక్కును బడా కార్పొరేట్లకు కట్టబెట్టడం సాధ్యం కాదని భావించి విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎంఎల్ఎ పల్లా కలిసి లేఖలు రాశారని పలువురు ఆరోపిస్తున్నారు. స్కూల్‌ను మూసివేస్తున్నందున టీచర్లకు విఆర్ఎస్ ఇచ్చి పంపించేయాలంటూ వారు లేఖలు రాయడం ఇది ఏపాటి రాజకీయ విజ్ఞత అన్న చర్చ విశాఖ ప్రజల్లో తాజాగా నడుస్తోంది.

ఇప్పటికే 3500 మంది కాంట్రాక్టు కార్మికులపై స్టీల్ యాజమాన్యం వేటు వేసింది. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కనీసం ఈ చర్యపై స్పందించలేదు. 2024 ఎన్నికల సమయంలో ఉక్కు పరిరక్షణే తమ అజెండా అంటూ ప్రకటించిన సదరు కూటమి నేతలు మాట తప్పడంపై కార్మికవర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో 22 వేల మంది నేషనల్ హెల్త్ మిషన్‌లో ఉద్యోగులు 198 కేడర్లలో గత దశాబ్దన్నర కాలంగా పనిచేస్తున్నారని వారికి ఉద్యోగభద్రత కల్పించాలని ఎన్‌హెచ్‌ఎం జెఎసి చైర్మన్ దయామణి డిమాండ్ చేశారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జిల్లా సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దయామణి మాట్లాడుతూ, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు అత్యంత తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మినిమం టైం స్కేలు (ఎంటిఎస్) ఒకే కేడర్ - ఒకే వేతనం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సమావేశానికి జెఎసి జిల్లా చైర్మన్ సురేష్ అధ్యక్షత వహించారు. ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి హానరరీ చైర్మన్ ఎ.వి.నాగేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్ రద్దు చేసి,12 గంటల పని విధానాన్ని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మెడకు ఉరికొయ్యిలా తగిలించాలని చూస్తోందని ఆరోపించారు. లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని ఈ నెల 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

ఎపి ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సెస్ ఫెడరేషన్ అధ్యక్షురాలు శిరీష ఎన్‌హెచ్ ఎం జిల్లా చైర్మెన్ సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా జెఎసి హానరరీ చైర్మన్ శశిభూషణం, జిల్లా జనరల్ సెక్రటరీ బ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్, నాగరాజు, శ్రీనివాస్, పుష్పేశ్వరావు, ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని కేడర్ల ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎవి.నాగేశ్వరరావు

శంకర్‌రెడ్డికి మొల్లి పరామర్శ

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ : 17వ వార్డు సీనియర్ నాయకులు, కరక చెట్టు పోలమాంబ ఆలయ మాజీ చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డిని వైసిపి విశాఖ తూర్పు నియోజకవర్గం మొల్లి అప్పారావు ఆదివారం పరామర్శించారు. శంకర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారన్న విషయం తెలిసిన వెంటనే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లా అధికార ప్రతినిధి గౌరవ పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరవ మువ్వల సురేష్, వార్డు అధ్యక్షుడు నీలారెడ్డి, 17వ వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ హబ్‌గా విశాఖ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖలో రోజురోజుకీ పెద్దపెద్ద ఆసుపత్రులు ఏర్పాటు అవుతున్నాయని ఇది హర్షించదగిన విషయమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నిర్మించిన పల్స్ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెజిహెచ్‌తో పాటు అనేక ప్రభుత్వ ఆసుపత్రులు విశాఖలో ఉన్నాయని, అదే విధంగా ప్రైవేటు ఆసుపత్రులు కూడా విరివిగా ఏర్పాటు కావడంతో,విశాఖ మెడికల్ హబ్ గా మారనుందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ఎం.శివప్రసాద్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అప్పలరత్నం, కూటమి నాయకులు యజ్ఞశ్రీ, సిఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మమేకం చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడం కోసం, తొలగించిన 4వేల మంది కాంట్రాక్ట్ వర్కర్లను తిరిగి నియమించడం కోసం, సొంత గనులు సాధించడం కోసం సాగుతున్న ఉద్యమాన్ని, ప్రజలతో మమేకం చేస్తూ బలోపేతం చేస్తామని బిహెచ్ఇఎల్ సిఐటియు యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఆదివారం 1560వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు బిహెచ్ఇఎల్ నాయకులు, స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టియుసి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని ఉధృతం చేయటానికి చేస్తున్న పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పివి రమణమూర్తి, ఆల్సి అప్పలనారాయణ, నారపురెడ్డి, పొన్నా శివరాం, సిహెచ్ఎస్‌వి నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ షాపులు

లక్షల్లో అడ్వాన్స్, వేలల్లో అద్దెలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలంలోని తర్లువాడ రెవెన్యూ సర్వే నెంబర్ 191 పరిధిలో ప్రభుత్వ భూమిని కొంతమంది తమదిగా ప్రకటించుకొని, అక్కడ అక్రమంగా చిన్న చిన్న షాపులు నిర్మించి అద్దెకు ఇస్తున్నారు. తర్లువాడ టోల్ ప్లాజా సమీపంలో గిరాకీ ప్రాంతంగా ఉన్న నేషనల్ హైవే పక్కన ఉండటంతో చిరు వ్యాపారులు అక్కడ షాపులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే అవకాశంగా భావించిన ఆక్రమణదారులు లక్షల్లో అడ్వాన్సులు, వేలల్లో నెలవారీ అద్దెలు వసూలు చేస్తున్నారు. గత ఏడాది అక్కడ నిర్మించిన కొన్ని షాపులను రెవెన్యూ అధికారులు తొలగించారు. కానీ కొంత కాలానికే రాత్రికిరాత్రి మళ్లీ నిర్మాణాలు చేపట్టారు. షాపుల కోసం అక్రమార్కులు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. తర్లువాడ నగరపాలేనికి చెందిన ఒక జాతీయ పార్టీకి చెందిన వ్యక్తి రాజకీయ అండతో స్థలాలను కబ్జా చేసి షాపులు ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు పరిశీలించి ప్రభుత్వ భూమి ఆక్రమణ కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రభుత్వ స్థలంలో షెడ్డు వేసి నిర్వహిస్తున్న దుకాణం

నేరాలు ఘోరాలు

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ మెడలో బంగారం చోరీచేసిన వ్యక్తిని నేరవిభాగం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు నేరవిభాగం సిఐ బిఎస్ఎస్.ప్రకాష్ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 5వ వార్డు పరిధిలోని వైఎస్ఆర్ కాలనీ బ్లాక్ నెంబర్ 25 ఎఫ్ఎఫ్1లో వృద్ధురాలు కె.వరలక్ష్మి వద్దిరాలు నివాసముంటున్నారు. ఈ నెల 2వ తేదిన గుర్తు తెలియని వ్యక్తి ఆ ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో ఉన్న రెండు తులాలు బంగారు గొలుసు తెంచుకొని పారిపోయాడు. ఆమె కుమార్తె వసంతి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తుచేపట్టారు. నేరవిభాగం ఎస్ఐ రంభ శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఎస్ఐ అమర్ శేఖర్, సిబ్బంది మల్లిక్, గణేష్, రమేష్ గస్తీ తిరుగుతున్నారు. ఆ సమయంలో పోలీసులను చూసిన భీమిలి ప్రాంతానికి చెందిన ఆదినారాయణరెడ్డి పారిపోవడాన్ని గమనించి పోలీసులు పట్టుకున్నారు. అతడిని విచారించగా బంగారు గొలుసు దొంగతనాన్ని అంగీకరించినట్లు సిఐ తెలిపారు. అతని నుంచి బంగారం గొలుసు స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

350 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఉమానారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యాన లోడగలవానిపాలెం గ్రామంలో ఉచిత మెగా నేత్ర, దంత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. తగరపువలస ఎన్ఆర్ఐ హాస్పిటల్, వేములవలస అమ్మ ఆప్టికల్ అండ్ ఐ క్లినిక్ వైద్యులు శిబిరంలో 350 మందికి వైద్య సేవలందించారు. చూపు మందగించిన రోగులకు ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేశారు. 100 మందికి పైగా రోగులకు త్వరలో కళ్లద్దాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పిప్పి పన్ను, క్లీనింగ్, రూట్ కెనాల్ తదితర చికిత్సలను దంత వైద్యులు అందించారు. జనసేన నాయకులు పంచకర్ల నాగ సందీప్ ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకుల్లో ఒకరైన బమ్మిడి తారక్‌ను అభినందించారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆప్టికల్ అండ్ ఐ క్లినిక్ నిర్వాహకులు రవిబాబు, జడ్‌పిటిసి మాజీ సభ్యులు బమ్మిడి ఉమ, సూర్యనారాయణ, జనసేన నాయకులు పంచకర్ల సందీప్, నాగోతి నాగమణి, తాట్రాజు అప్పారావు, తమ్మిన అప్పలరాజు సాకరి శ్రీను, బంక సత్యం, పిన్నింటి రమణ, మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-మధురవాడ : స్థానిక మధురవాడ సబ్ స్టేషన్ పరిధి 11కెవి రేవళ్లపాలెం ఫీడర్‌పై మరమ్మత్తుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. వల్లినగర్, మధురవాడ హైస్కూల్ ఏరియా, రేవాళ్ళపాలెం విలేజ్, రేవళ్లపాలెం పోలీస్ స్టేషన్, ఎంఎస్ఆర్ లే-అవుట్, భాస్కర్‌నగర్, నగరంపాలెం తదితర ప్రాంతాలకు సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

6000 మందికి అన్నదానం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం మజ్జిపేట గ్రామంలో ఆదివారం దాదాపు 6 వేల మందికి అన్నదానం చేశారు. శ్రీను సిద్ధాంతి 53వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో విష్ణు దేవానంద సరస్వతి మహరాజ్, సిహెచ్ అన్నపూర్ణాదేవి, రామకృష్ణానంద, సిహెచ్.మూర్తి, పంచాయతీ సర్పంచ్ మజ్జి సూరి నాయుడు, ఎంపిటిసి సభ్యులు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారాయణరావు వర్ధంతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపిలో పలు పదవులు నిర్వహించిన సీనియర్ నాయకులు మొకర నారాయణరావు 13వ వర్ధంతిని ఆదివారం స్థానిక కళ్లవీధిలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, వుడా డైరెక్టర్‌గా, మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నో పదవులు నిర్వహించి వాటికి వన్నె తెచ్చారని నాగవంశ సంక్షేమ సంఘం ప్రతినిధులు గాడు అప్పలనాయుడు, ఎస్.జోగారావు, కె.ముత్యాలరావు, సన్యాసినాయుడు తదితరులు కొనియాడారు.

చట్ట వ్యతిరేక ఒప్పందం రద్దు తథ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : చిట్టివలస జ్యూట్ కార్మికులకు తీవ్ర నష్టం చేసేలా గత ప్రభుత్వంతో యాజమాన్యం, కొన్ని కార్మిక సంఘాలు కుదుర్చుకున్న చట్ట వ్యతిరేక ఒప్పందం రద్దు తథ్యమని చిట్టివలస జ్యూట్ మిల్స్ లాకౌట్ బాధిత కార్మిక సంఘం న్యాయ సలహాదారు ఎస్.జనార్ధనరావు స్పష్టం చేశారు. స్థానికంగా ఆదివారం సంబంధిత కార్మిక సంఘం నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019, 2020లో రెండు దఫాలుగా జరిగిన ఒప్పందం చట్ట వ్యతిరేకమైందని పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం పూర్తిగా యాజమాన్యానికి అనుకూలమైందన్నారు. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా ఇప్పటికే న్యాయస్థానంలో కేసులు నడుస్తున్నాయని తెలిపారు. న్యాయ పోరాటంలో తుదకు విజయం సాధించేది కార్మికులే అని స్పష్టం చేశారు.

కల్యాణ మండపం పునర్నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కొమ్మాది : జివిఎంసి జోన్-2 పరిధి 5వ వార్డు సాయిరాంకాలనీ ఫేస్-3లో అసంపూర్తిగా నిలిచిన కల్యాణ మండపాన్ని రూ.80.40లక్షల వ్యయంతో పున్ర ప్రారంభ పనులకు ఆదివారం కార్పొరేటర్ మొల్లి హేమలత శంకుస్థాపన చేశారు. దీంతోపాటు 5వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ మొల్లి హేమలత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇక్కడ కల్యాణ మండపం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కొంతమేర పనులు జరిగాక ప్రభుత్వం మారిందని, వైసిపి అధికారంలోకి రావడంతో నిధులు మంజూరు కాక పనులు నిలిచిపోయాయని తెలిపారు. తాను కార్పొరేటర్‌గా ఎన్నికైన తర్వాత అన్ని కౌన్సిల్ సమావేశాల్లో ఈ కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలని పలుమార్లు విజ్ఞప్తిచేసినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం స్పందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో వార్డులోని దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారమార్గం దొరికిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, వాండ్రాశి అప్పలరాజు, కొండపు రాజు, బొడ్డేపల్లి రంగారావు, ఆవాల నీలయ్య, పాపారావు, యోగేశ్వరరావు, జగన్నాథం, ఆవాల నారాయణరావు, కొల్లి దేవి, దువ్వ రమణ, మోహన్, ఒలేటి శ్రావణ్, జ్యోజిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన శిక్షణ పొందిన వారిలో 24 మంది నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పొందేందుకు ఎంపిక కావడంతో చిట్టివలస జెడ్పీ హై స్కూల్ ప్రాంగణంలో ఆదివారం వారిని అభినందిస్తూ సభ ఏర్పాటుచేశారు. ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు పోటీ పరీక్షలకు సంసిద్ధులు కావాలన్నారు. నిర్వాహకులను అభినందించారు. ఎంఇఒ ఎం.శివరాణి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే బోధన, ఉచితంగా స్కూల్ యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాలను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలని తల్లి దండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, కోశాధికారి బి.అప్పారావు, పూర్వ హెచ్ఎం పొట్నూరు మురళీమోహనరావు, చిట్టివలస, లక్ష్మీపురం జెడ్పీ హైస్కూళ్ల హెచ్ఎంలు డి.ఆదినారాయణ, డి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనపై తప్పుడు ప్రచారాలు చేస్తే క్రమశిక్షణ చర్యలు

ప్రజాశక్తి -ఆనందపురం : జనసేన పార్టీపై తప్పుడు ప్రచారాలు చేస్తూ, పార్టీ శాసనాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జనసేన ఆనందపురం మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు హెచ్చరించారు. ఆనందపురం రూరల్ జనసేన కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి త్వరలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయనున్నామన్నారు. సమావేశాలకు హాజరుకాని మండల స్థాయి నాయకులను గుర్తించి అవసరమైతే కమిటీ నుంచి తొలగిస్తామని చెప్పారు.

జంతువులను సంరక్షించాలి

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లను వేశారు.

ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి గాంధీగ్రామ్ పశువుల ఆసుపత్రి డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యాన యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌ను కుక్కలకు వేశారు. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.

ఆరిలోవ : జునోసిస్ డే సందర్భంగా తోటగరువు పశువైద్యశాలలో రేబిస్ వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఆరిలోవ పరిసర ప్రాంతాల నుంచి సుమారు 523 కుక్కలకు రేబిస్ నివారణ టీకాలను ఉచితంగా వేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎన్.కరుణాకరరావు, ఉప సంచాలకులు డాక్టర్ ఎన్.చంద్రమౌళి, సహాయ సంచాలకులు డాక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

మాడుగుల: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మాడుగుల మండలంలోని పలు పశు వైద్య శాలలు, రైతు సేవా కేంద్రాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మాడుగుల పశువైద్యశాల ఆవరణలో 46 పెంపుడు కుక్కలకు టీకాలు వేయడం జరిగిందని మాడుగుల ఏరియా పశువైద్య శాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. మండలంలో 161 టీకాలు వేయడం జరిగిందన్నారు.

కోటవురట్ల: పెంపుడు కుక్కలకు టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి ప్రతాప్ తెలిపారు.మండల కేంద్రం, పాములవాక పశువైద్యశాల వద్ద పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని జైతవరం గ్రామంలో పశు సంవర్ధక సహాయకులు మోర్తా శ్రీనివాసరావు 20 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక ఏరియా వెటర్నరీ హాస్పిటల్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో రేబిస్ టీకాలు వేశారు. మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దుర్గాప్రసాద్, నరేష్, పుష్ప, శిరీష, యమున, పశువైద్య సహాయకులు అలివేణి, భవాని, శ్రీరామ్మూర్తి , లాబ్ టెక్నీషియన్ ఉదయ, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

రోలుగుంట: రోలుగుంట పశు వైద్య శాలలో ఉచితంగా 19 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి నూకేశ్వరరావు పశువుల వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజేశ్వరి, అన్నపూర్ణ, శివరాజు, యశోద పాల్గొన్నారు.

అనకాపల్లి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం అనకాపల్లి ఏరియా వెటర్నరీ హాస్పిటల్లో 198 పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ టీకాలు వేశారు. పెంపుడు జంతువుల యజమానులకు జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆర్డిఒ షేక్ ఆయేషా, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి రామ్మోహనరావు, వెటర్నరీ ఏడి డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు

సబ్బవరం : మండలంలో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని సబ్బవరం, అంతకాపల్లి, గుల్లేపల్లి, ఆరిపాక పశు వైద్యశాలల్లో వైద్యశిబిరాలలో 97 పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషాకుమారి తెలిపారు.

'తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం' వెబ్ సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : రైటర్స్ అకాడమీ ఆధ్వర్యాన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం 'తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం' వెబ్ సైట్ ఆవిష్కరణ సభ నిర్వహించారు. సభలో అతిథుల చేతుల మీదుగా నాటకాల పుస్తకాల డిజిటలైజేషన్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆత్మీయ అతిథిగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి గుమ్మళ్ల బలరామయ్య హాజరై మాట్లాడుతూ, బాదంగిరి సాయి జీవితాంతం నాటకాల కోసమే జీవించారని, ఆయన సేకరించిన పదివేల పుస్తకాలను డిజిటల్ వెబ్ సైట్‌లో పొందుపరచడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. విశాఖలో నాటకాలు కోసం సొంతంగా బాదంగిరి సాయి లైబ్రరీ ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. ఎవరికి నాటక పుస్తకం కావాలన్నా సాయి జెరాక్స్ తీసి ఇచ్చేవారని చెప్పారు. అద్దె ఇంట్లో ఉంటూ పదివేల నాటకాల పుస్తకాలు సాయి సేకరించారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ మంత్రి, నాటక రచయిత దాడి వీరభద్రరావు మాట్లాడుతూ, నేడు పాత పుస్తకాలు కనిపించడం లేదని, ఈ తరుణంలో వాటిని డిజిటలైజేషన్ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మన్నం వెంకటరాయుడు, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారావు, మాజీ డిజిపి అత్తిలి సుధాకర్, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి, సినిమా ఫొటోగ్రాఫర్ ఎంవి.రఘు, నటులు, దర్శకులు కోల్లి మోహన్‌రావు, వెంపటి రాధాకృష్ణ తదితరులు మాట్లాడారు. అనంతరం బాదంగిరి సాయి సతీమణి హైమావతిని అతిథులు సత్కరించారు. భర్త సాయిని సభలో తలుచుకొని హైమావతి కన్నీటి పర్యంతమయ్యారు. నటీమణి శివ జ్యోతిని సత్కరించి రూ.10వేల నగదును వివి రమణమూర్తి అందజేశారు. కోలాటం ప్రదర్శనలో ప్రతిభ చూపిన వారిలో మొదటి ప్రైజ్ జ్యోతి, రెండో ప్రైజ్ సన్యాసమ్మ, మీనా, మూడో ప్రైజ్ లలిత, పద్మావతిలకు అందజేశారు. ప్రతి ఏడాది బాదంగిరి సాయి పురస్కారం అవార్డును అందజేయనున్నట్టు మేడా మస్తాన్ రెడ్డి సభలో ప్రకటించారు.


కామెడీ స్కిట్‌ను ప్రదర్శిస్తున్న ఎంవి.సుబ్రహ్మణ్యం తదితరులు

పౌర గ్రంథాలయంలో కామెడీ షో

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా పౌరగ్రంథాలయంలో ఆదివారం కామెడీ షో నిర్వహించారు. ఎంవి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, పోర్ట్ శేషు, కుమారి, పుష్పమినాయుడు, రామానుజం, భానుప్రకాష్, సూర్యం, శివజ్యోతి, రాగన్‌నాయుడు, నరసింహారావు లఘు నాటికలను ప్రదర్శించారు. సర్దుకుపోదాం, స్విమింగ్‌పూల్, జామచెట్టు, తాగుబోతు, కోడి పందాలు, డాక్టర్ పేషెంట్, డ్రైవర్ జాబ్, ప్రశాంతత, 2000 నోట్ తదితర లఘు నాటికలను ప్రదర్శించి నవ్వులతో ముంచారు.

వీధి నాటకాలకు ఆదరణ

ప్రజాశక్తి- సీతమ్మధార : నేటి ఆధునిక యుగంలో కూడా వీధి నాటకాలకు ఆదరణ ఉందని 'టామీ టామీ టామీ' నాటకం రుజువు చేసిందని ఏయూ ఆర్ట్స్ కళాశాల థియేటర్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ ఎ.నరసింహారావు అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రరంథాలయం ఎదురుగా గల బహిరంగ ప్రదేశంలో రైటర్స్ అకాడమీ ఆధ్వర్యాన సుదర్శన్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు 'టామీ టామీ టామీ' వీధి నాటకాన్ని ఆదివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి నరసింహారావు మాట్లాడుతూ, అత్తిలి కృష్ణారావు రాసిన నాటకానికి బొబ్బా ధవళేశ్వరరావు చక్కని దర్శకత్వం వహించారన్నారు. ఈ నాటకంలో చక్కని సందేశం ఉందని, ప్రతి ఒక్కరిని ఆలోచింప చేస్తుందని చెప్పారు. వాస్తవానికి దగ్గరగా ఉందని, మనుషుల కన్నా కుక్కలకే సమాజంలో విలువ ఉందని తెలియజేసిందని తెలిపారు. సిక్కిం మాజీ డిజిపి అత్తిలి సుధాకర్ మాట్లాడుతూ, టామీ టామీ టామీ నాటకంలో నటులు పాత్రలలో జీవించారని కొనియాడారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ, సుమారు 40 ఏళ్ల క్రితం జగదాంబ జంక్షన్లో ఈ వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిసి, వార్త దినపత్రికలో పనిచేస్తున్న తాను చూడడానికి పరిగెత్తానని గుర్తు చేసుకున్నారు.

పాత, కొత్త వార్డులతో గందరగోళం



జివిఎంసి రెవెన్యూలో పాతవార్డులే కొనసాగింపు
ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి -గాజువాక

జివిఎంసి ఎన్నికలు జరిగి, కొత్త వార్డులుగా రూపాంతరం చెంది నాలుగేళ్లుగడుస్తున్నప్పటికీ జివిఎంసి రెవెన్యూ పరిధిలో నేటికీ పాత వార్డుల ప్రకారమే పనులు జరుగుతున్నాయి. దీంతో గాజువాక నియోజవర్గ ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. గాజువాక జోన్ పరిధిలో మొత్తం 20 వార్డులు ఉన్నాయి. జివిఎంసి 64వ వార్డు నుండి 88వ వార్డు వరకు మొత్తం 20 వార్డులుగా గాజువాక జోన్ స్వరూపం విస్తరించి ఉంది. ఇంటి పన్నులు చెల్లించే ప్రజలు గాజువాకలో మొత్తంగా 2,75,000 మంది ఉన్నారు. ప్రస్తుతం వీరంతా తరచూ గందరగోళానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఉన్న 64వ వార్డు గతంలో 50వ వార్డుగా ఉండేది. దాన్ని 64, 65 వార్డులుగా విభజించారు. ఈ ప్రాంత ప్రజలు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నా, ఇంటి పన్ను చెల్లించాలన్నా రెవెన్యూపరంగా కొత్త వార్డు పేరు చెబితే గాజువాక జోన్ కార్యాలయంలో అంగీకరించడం లేదు. పాత వార్డు పేరుతోనే ఇంటి పన్నులు చెల్లించాలని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ మరే ఇతర కార్యక్రమాలు చేయాలన్నా ప్రస్తుతం ఉన్న కొత్త వార్డు పేరు చెప్పాలని చెబుతున్నారు. ఈ విధంగా గాజువాక ప్రజలు ప్రతి పని విషయంలోనూ కొత్త, పాత వార్డులతో తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 20 వార్డుల ప్రజలు ఏదో ఒక సమస్యతో తరచూ సతమతమవుతున్నారు. వీటిని పరిష్కరించాల్సిన అధికారులు శ్రద్ధ కనబరచకపోవడంతో మరింత ఆలస్యం జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ గందరగోళం నుంచి ఎప్పుడు బయటపడతోమోనని ప్రజలు ఆందోళనలో ఉన్నారు.

సరిహద్దులు తెలియక ఇబ్బందులు

కొత్త వార్డుల సరిహద్దులు తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో శ్రీనగర్ మొత్తం 61వ వార్డు పరిధిలో ఉండేది. దాన్ని 71, 72 వార్డులుగా విభజించారు. ఏ కాలనీ ఎటు వస్తుందో నేటికీ స్థానిక ప్రజలకు తెలియక ఇబ్బందులు పడుతున్నారు. దానికి సంబంధించిన సరిహద్దు బోర్డులు ఏర్పాటుచేయలేదు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏ వార్డు చెప్పాలో తెలియక ఇబ్బందులు

ఇంటి పన్ను కట్టాలన్నా, పిల్లలు పుట్టిన సర్టిఫికెట్లు తీసుకోవాలన్నా ఏ వార్డు చెప్పాలో తెలియక తరచూ ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని పనులకు పాత వార్డు చెప్పమంటున్నారు, మరికొన్నింటికి కొత్త వార్డు చెప్పాలని అడుగుతున్నారు. గందరగోళంగా ఉంది.



కె.అనిత,
పెదగంట్యాడ

త్వరలో కొత్తవార్డుల స్వరూపం

గాజువాక జోన్‌కు సంబంధించి 20 కొత్త వార్డులకు సంబంధించి మ్యాపింగ్‌ను సచివాలయ సిబ్బంది పూర్తి చేశారు. దానిని ఉన్నతాధికారులకు పంపాం. త్వరలో కొత్త వార్డుల స్వరూపం రానుంది.

శేషాద్రి
జోనల్ కమిషనర్

అధికారులకే స్పష్టత లేదు

ఎన్నిసార్లు అడిగినా ఇంటి పన్ను చెల్లించినప్పుడు అధికారులు కొత్త వార్డులు వస్తాయని చెబుతున్నారు తప్ప, నేటికీ పాత వార్డులోనే కొనసాగిస్తున్నారు. మేము నివసిస్తున్న వియ్యపువానిపాలెం గతంలో 62వ వార్డులో ఉండేది. ప్రస్తుతం అది 74వ వార్డుగా మారింది. కానీ ఇంటి పన్ను 62వ వార్డు కిందనే కొడుతున్నారు. నేను పాప కోసం ఎడ్యుకేషన్ లోన్ పెట్టినా పాత, కొత్త వార్డుల గందరగోళంతో అది మంజూరుకాలేదు.



అల్లు రమణారావు యాదవ్
వియ్యపువానిపాలెం

మెజీషియన్ పట్టాభిరాం చిరస్మరణీయుడు

ప్రజాశక్తి-గోపాలపట్నం : ప్రముఖ మెజీషియన్, హిప్నాటిస్టు కీర్తిశేషులు పట్టాభిరాం చిరస్మరణీయుడని గోపాలపట్నం కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు అన్నారు. గోపాలపట్నం కళాపీఠం కార్యాలయంలో ఆదివారం పట్టాభిరాం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టాభిరాం బహుముఖ ప్రజ్ఞాశాలిగా మంచి కీర్తి ప్రతిష్టలు ఆర్జించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గొరపల్లి బంగార్రాజు, నూకరాజేశ్వరరావు, చందు సుబ్బారావు, గొరకాల రామదాసు, గోపాలపట్నం గ్రంథాలయాధికారి నరసింహం, బెవర రమేష్, పాణిగ్రహి తదితర్లు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ములగాడ : మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిఐటియు మల్కాపురం జోన్ 10 మహాసభను సిఐటియు ఆఫీసులో ఆదివారం నిర్వహించారు. తొలుత సిఐటియు పతాకాన్ని సీనియర్ నాయకులు కె.నూకరాజు ఎగురవేశారు. కార్మిక నేతలు రమణారావు, జి.అప్పలరాజు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరారు. దీనిపై కార్మిక వర్గం ఐక్యంగా పోరాడితే పరిష్కారమవుతాయని తెలిపారు. అందుకోసమే ఈ నెల 9వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు కుమారమంగళం మాట్లాడుతూ, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ పరిశ్రమలను మూసివేస్తున్నారని, ఆ విధానానికి వ్యతిరేకంగా పోట్లాడాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను మార్పుచేసి కార్మికులను బానిసలుగా మార్చే విధానాలను వ్యతిరేకించాలన్నారు.

సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తోందన్నారు. కార్మికులకు వేతనాలు పెంచకపోగా కరెంటు చార్జీలు, ఇంటి పన్నులు, స్మార్ట్ మీటర్లు, ధరలు విపరీతంగా పెంచే విధానాలను చంద్రబాబు తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

అధ్యక్ష వర్గంగా ఎస్.ప్రసాదు, కె.పెంటారావు, ఎన్.ఉమ వ్యవహరించారు. గత మూడేళ్లలో జరిగిన కార్యకలాపాలు, ఉద్యమాలు, పోరాటాలను ఆర్.లక్ష్మణమూర్తి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికను ప్రతినిధులు ఆమోదించారు. రాబోయే మూడేళ్లలో చేపట్టే ఉద్యమాలు, పోరాటాల గురించి చర్చించి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, తొలగించిన కార్మికులు విధుల్లోకి తీసుకోవాలని, అధిక ధరలు తగ్గించాలని, నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలని, భవన నిర్మాణ, ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఉద్యోగ భద్రత, ఉపాధి కల్పించాలని పలు తీర్మానాలను ఉరుకూటి బాబూరావు ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఆమోదించారు. అనంతరం 21 మందితో నూతన కమిటీ ఎన్నికైంది.

నూతన కమిటీ ఎన్నిక

సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులుగా బిఎస్ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.లక్ష్మణమూర్తి, కోశాధికారిగా వి.బాబూరావు, సభ్యులుగా పి.పైడిరాజు, ఎ.సత్యారావు, కె.పెంటారావు, జి.నరేష్, ఎ.రమణ, ఎం.ఆదినారాయణ, ఆర్.అప్పన్న, ఎస్.ప్రసాద్, ఎం.సత్యనారాయణ, వై.రాజబాబు, ఎన్.ఉమారామ నాయుడు, జి.రమణ ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా మహాసభ

మహాసభ ఉత్సాహంగా జరిగింది. మహాసభ సందర్భంగా శనివారం మల్కాపురం నుండి కోరమండల్ గేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సభ ఏర్పాటుచేశారు. ఈ సభలో సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడుతూ, ఐక్య పోరాటాలతో కార్పొరేట్ శక్తుల విధానాలను ఎదుర్కొని అడ్డుకట్ట వేయగలమని చెప్పారు. మోడీ, కూటమి ప్రభుత్వాలు అదానీ, అంబానీ పంచన చేరి కార్మికులకు ద్రోహం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన చేపట్టే సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధి రోడ్లకు బిల్లుల గండం!

- రూ.132 కోట్ల బకాయిలు చెల్లించక నిలిచిన పనులు
- అసంపూర్తి రోడ్లతో జనం అవస్థలు ...పట్టని ప్రభుత్వం
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న ధ్వజం

ప్రజాశక్తి- దేవరాపల్లి : కాంట్రాక్టర్లకు రూ.132కోట్ల మేర బిల్లులు చెల్లించకపోవడంతో ఉపాధి హామీ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన రోడ్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు డి వెంకన్న విమర్శించారు. బిల్లు బకాయిలను వెంటనే చేపట్టి, రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

వాలాబు పంచాయతీలో పూలగరువు, రామన్నపాలెం, బుచ్చంపాలెం, బొడ్డగుమ్మి, కోనాం, కోడాపల్లి, బొర్రచింత, తుమ్మలపాలెం గ్రామాలకు సుమారుగా రూ.12 కోట్లతో రోడ్లు మంజూరు చేసి పనులు చేపట్టగా, కేవలం రూ.40 లక్షల నిధులు మంజూరు చేసారని, దీంతో పనుల ప్రాప్తికి బిల్లులు ఇవ్వకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు.

వీరభద్రిపేటకు రూ.84 లక్షలతో బిటి రోడ్డు మంజూరుకాగా మట్టి పనిచేసి వదిలేశారన్నారు. నేరెళ్ళపూడి బోడిగరువు మదనగరువు గ్రామాలకు రూ.1,90 కోట్లుతో మంజూరైన రోడ్లు అసంపూర్తిగా నిలిచి పోయాయన్నారు. శంకరం పంచాయతీ తాడివలస, గొప్పూరు, రాజంపేట, వేలంపాడు మామిడిపాలెం, కొత్తవలస గ్రామాలకు రూ.9,20 లక్షలతో ఎర్త్ వర్క్ పనులు నిలుపుదల చేసారన్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్‌లో అసంపూర్తి రోడ్లన్నీ అధ్వానంగా మారి, రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఉందని, అత్యవసర సమయంలో 104,108 వాహనాలు రాలేని స్థితిలో గర్భిణులు, రోగులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.



బిల్లులు చెల్లించక పనులు నిలిచిపోవడంతో అధ్వానంగా మారిన రోడ్డు

చేసిన పనులకు అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నా.నిధులు రాకపోవడంతో చెల్లింపులు జరగడం లేదని, అప్పులు చేసి సిసి రోడ్లు, ఇతర పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రూ.132కోట్ల బిల్లుబకాయిలు ఎప్పుడు చెల్లిస్తారోనని ఎదురు చూస్తున్నారన్నారు. గతేడాది అక్టోబర్ 14న పల్లెపండుగలో గ్రామసభలు నిర్వహించి, ఆర్భాటంగా మంజూరు చేసి, సిసిరోడ్లు, డ్రైనేజీలు, ఇతర నిర్మాణాలకు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించిన అధికారులు, ఫిబ్రవరి 15 వరకు చేపట్టిన పనులకు తొలిదశలో బిల్లులు అప్‌లోడ్ చేసినా నాలుగు నెలలుగా చెల్లింపులు లేకపోవడం దుర్మార్గమన్నారు. రూ.143కోట్లకు బిల్లులు అప్‌లోడ్ చేస్తే, కేవలం రూ.11కోట్ల నిధులు విడుదల చేస్తే కాంట్రాక్టర్లు పనులెలా చేయగలరని ప్రశ్నించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద 188 కిలోమీటర్ల పొడవైన 1,384 రోడ్ల నిర్మాణ పనులు మంజూరుకాగా, పంచాయతీరాజ్ ఇంజినీర్ల పర్యవేక్షణలో ఫిబ్రవరి 15 నాటికి జిల్లాలో 166 కిలోమీటర్ల పరిధిలో 1,854 రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, బిల్లు బకాయిలకు నిధులకు విడుదల చేసి, అసంపూర్తి రోడ్లను పూర్తి చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

పిఆర్‌సి కమిటీని నియమించాలి



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి - అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి కమిటీ చైర్మన్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఉద్యోగులకు న్యాయంగా రావలసిన పిఆర్‌సి అమలు చేయలేదన్నారు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ , సరెండర్ లీవ్‌లు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ. కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగులతో పనిచేయించుకుంటున్న రీతిలోనే ఆర్థిక బకాయిలు చెల్లించాలన్నారు.విశ్రాంత ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షులు పి. వెంకట్రావు, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, కోశాధికారి జోగా రాజేష్, జిల్లా కార్యదర్శులు జిఎస్ ప్రకాష్, రమేష్‌రావు, జికెఆర్ స్వామి, ఎస్ఎస్ నాగమణి, శంకర్ ప్రసాద్, ఉప్పాడ రాము పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజును కలిసిన శాప్ డైరెక్టర్



ఎమ్మెల్యే రాజును అభినందిస్తున్న శాప్ డైరెక్టర్ బుచ్చిరాజు

ప్రజాశక్తి - సబ్బవరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఎపి (శాప్) డైరెక్టర్‌గా ఎన్నికైన పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) ఆదివారం చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్‌రాజును ఆయన స్వగృహానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెఎస్ఎన్. రాజుకు పుష్పగుచ్చం ఇచ్చి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గండి దేముడు బాబు, సబ్బవరం టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

అంతకాపల్లిలో రజనీ కల్యాణం సినీ సందడి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి గ్రామంలో 'రజనీ కల్యాణం' సినీ సందడి నెలకొంది. ఇటీవల ప్రారంభించిన రజనీ కల్యాణం సినిమా మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ఆదివారం చేసువడంతో రెండవ షెడ్యూల్‌ను టిడిపి మండల మాజీ అధ్యక్షులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు క్లాప్ కొట్టి ప్రారంభించారు. అలాగే అనకాపల్లి పార్లమెంటరీ టిడిపి కార్యదర్శి పల్ల తాతారావు కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా రజనీకల్యాణం సినిమా డైరెక్టర్ రజనీ కళ్యాణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆకట్టుకునే విధంగా రజనీకల్యాణం సినిమాను చిత్రీకరించినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా సినిమా షూటింగ్‌కు కొంత అంతరాయం ఏర్పడిందన్నారు. అయితే 15 రోజుల్లో ఈ సినిమాను పూర్తిచేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. సినిమా షూటింగ్‌ను తిలకించేందుకు గ్రామీణ ప్రాంత యువకులు, మహిళలు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో గెద్దం రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు



రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభంలో చిత్రయూనిట్

ముగిసిన అటల్ ఎఫ్‌డిపి



కెప్టెన్ ఆదినారాయణను సత్కరిస్తున్న డైట్‌ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి :స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజులపాటు నిర్వహించిన అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) విజయవంతంగా ముగిసిందని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ తెలిపారు. ముగింపు కార్యక్రమానికి నావెల్ సంస్థ కెప్టెన్ ఆదినారాయణ మాట్లాడుతూ, నావిక సంస్థలో కొత్త పరికరాలను సృష్టించడానికి ఉపకరించే విద్యార్థులు డిజైన్ థింకింగ్, కొత్త విధానాలపై విద్యార్థులు నైపుణ్యం సాధించాలన్నారు. కమాండర్ టి రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులు డిజైన్ థింకింగ్ అలవర్చుకోవడం వల్ల నూతన విధానాలను మెరుగుపరచవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత, డీన్ అకడమిక్, వైస్ ప్రిన్సిపల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిఎస్ఇ ఫ్యాకల్టీ, స్టూడెంట్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

'తోడపెద్దు' కథకు తృతీయ బహుమతి



బొడ్డేడ బలరామస్వామి

ప్రజాశక్తి - కశింకోట: . తెలంగాణ రాష్ట్రంలోని ముల్కనూరు సాహితీ పీఠం, నమస్తే తెలంగాణ పత్రికలు నిర్వహించిన 2025 కథల పోటీలలో కశింకోట గ్రామానికి చెందిన బొడ్డేడ బలరామస్వామి రాసిన తోడపెద్దు కథకు తృతీయ బహుమతి లభించింది. 600పైగా వచ్చిన కథలను పరిశీలించిన ఐదుగురు న్యాయనిర్ణేతల బృందం ఆదివారం ఫలితాలను వెల్లడించగా, వాటిలో తోడపెద్దుకు ప్రతిష్టాత్మక బహుమతి లభించింది. ఈ నెల 27న వరంగల్ దరి ముల్కనూరు జరిగే బహుమతి ప్రదానోత్సవంలో తోడపెద్దు కథా రచయిత బలరామస్వామికి రూ. పదివేలు నగదు, ప్రశంసాపత్రం, షీల్డ్ తో సత్కరించనున్నారు. 2021లో ఈ సంస్థ నిర్వహించిన కథల పోటీలో బలరామస్వామి రాసిన కీడు గుడిసె ప్రత్యేక బహుమతిని సాధించింది. 2024లో డేగ కథ తృతీయ బహుమతిని గెల్చుకున్నారు. ఇప్పుడు తోడపెద్దు కథ మళ్లీ తృతీయ బహుమతిని గెలుచు కోవడంతో బలరామస్వామిని పలువురు అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : గాండ్ల తెలకల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల గాండ్ల తెలకల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక గవరపాలెం విశాఖ ఫైనాన్షియర్స్ సంక్షేమ సంఘం ఫంక్షన్ హాల్‌లో సంఘం అనకాపల్లి జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సింహాద్రి అలేఖ్య, చిత్రాడ సౌమ్య సత్య, ఎన్నేటి జశ్విత, గండేపల్లి హాసిని, అలాగే ఇంటర్ విభాగంలో పేరూరి రత్నమణి పురోత్త, గండేపల్లి నేహా, బోయిదాపు ప్రణీత్, ఇంజరపు చేతనలకు గ్రోసు గోపాలయ్య గోల్డ్ మెడల్స్ సంఘం గౌరవాధ్యక్షులు రాజపూడి కోటేశ్వరరావు అందజేశారు. సంఘం అధ్యక్షులు గండేపల్లి వెంకట్రావు, జనరల్ సెక్రటరీ కొమ్మునా పల్లి వాసు, గౌరవాధ్యక్షులు రాజపూడి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని వివిధ మండలాల్లో శాఖల ఏర్పాటుతో పాటు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు గండేపల్లి వెంకట్రావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో టిడిపి, కూటమి అభ్యర్థులకు అండగా నిలిచి ఓట్లేసి గెలిపించామని, అయితే తమ కులానికి రాజకీయ ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. జనరల్ సెక్రటరీ కొమ్మునాపల్లి వాసు మాట్లాడుతూ కల్యాణమండపానికి స్థలం కేటాయింపు, బిసి కార్పొరేషన్‌లో ప్రాతినిధ్యం కల్పన, వృత్తిదారులకు ప్రభుత్వపరంగా రాయితీలు, రుణసదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు..

వెంకన్న ఆలయానికి వితరణ



విరాళం అందిస్తున్న ద్వారపురెడ్డి రవి

ప్రజాశక్తి- కశింకోట మండలంలోని నరసింగబిల్లి వెంకటేశ్వర ఆలయానికి ఆదివారం ముగ్గురు భక్తులు రూ. 40,232 విరాళాన్ని ఆలయ కమిటీకి ఆదివారం అందజేశారు తలుపులు వెంకటరెడ్డి రూ.20 వేలు, పప్పు రమణ,వరలక్ష్మి దంపతులు రూ.10,116 రూపాయలు, తాళ్లపాలెం భార్గవి స్కూల్ కరస్పాండెంట్ ద్వారపురెడ్డి రవి రూ.10,116 వితరణ ఆలయకమిటీకి అందజేశారు.

అవసరం 8,014... వచ్చినవి 1,284

బూట్లు పంపిణీపై సందిగ్ధం!

- ఎవరికివ్వాలో తెలియక తలలు పట్టుకుంటున్న విద్యాశాఖ అధికారులు
- విద్యార్థుల నుంచి పెరుగుతోన్న ఒత్తిడి



స్టాక్ పాయింట్‌లో నిల్వ ఉన్న బూట్లు, సాక్సులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : పాఠశాలలు తెరిచి మూడు వారాలు గడిచినా ఇప్పటికీ విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లలో ఉండాల్సిన బూట్లు పంపిణీ జరగలేదు. మండలం, జివిఎంసి పరిధిలో ఒకటో తరగతి నుంచి 10 వ తరగతి వరకు 8,014 మది విద్యార్థులకు బూట్లు అవసరమని మండల విద్యాశాఖ నుంచి ఆ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపగా, ఇక్కడి బ్యాంకు కాలనీ, ప్రకృతిస్కూల్‌లో స్టాక్ పాయింట్‌కు తొలి విడతగా 1284 షూస్, 2,568 సాక్సులు వచ్చాయి. ఇవి 625 మంది బాలురు, 659 మంది బాలికలకు మాత్రమే సరిపోయేలా వచ్చాయి.. ఒక్కో విద్యార్థికి జత బూట్లుతోపాటు రెండు జతల సాక్సులు ఇవ్వాల్సి ఉంది.

మొత్తం 8,014 మంది విద్యార్థులు ఉన్న నేపథ్యంలో కేవలం 1284 మందికి మాత్రమే వచ్చిన వీటిని ఎవరికి ఎలా పంపిణీ చేయాలని స్థానిక విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇంకా 6,730 మందికి రావాల్సిన బూట్లు, సాక్సులు ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. దీంతో ప్రస్తుతం అందుబాటులోన్న 1284 సెట్‌లను పాఠశాలలకు పంపిణీ చేయాలా? వద్దా? అన్న సందిగ్ధంలో మండల విద్యా శాఖ అధికారులు ఉన్నట్లు సమాచారం. అరకొరగా వచ్చిన షూస్, సాక్సులు పాఠశాల లో కొద్ది మంది విద్యార్థులకు ఇచ్చి, మరికొందరికి ఇవ్వకుంటేనే అసలు సమస్య తలెత్తే పరిస్థితి ఉంది. దీంతో కనీసం ఆరోవంతు మంది విద్యార్థులకు కూడా సరిపడని బూట్లు, సాక్సులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వీటిని పంపిణీ చేయడం కన్నా, మిగతావి వచ్చిన తర్వాతే అందరికీ అందజేస్తే బాగుంటుందేమో అన్న ఆలోచనలో మండల విద్యాశాఖ అధికారులు ఉన్నట్లు సమాచారం.

ఘనంగా జగన్నాథస్వామి మారు రథయాత్ర



జగన్నాథస్వామి మారు రథయాత్ర ప్రారంభిస్తున్న రాంకీ

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : పట్టణంలో జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర భక్తుల కోలాహలం మధ్య ఆదివారం ఘనంగా జరిగింది. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ పూజలు నిర్వహించి, రథయాత్రను ప్రారంభించారు. జగన్నాథ రథోత్సవాన్ని విజయవంతంగా నిర్వహణకు సహకరించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు ఈవో అర్చకులు పాల్గొని స్వాగతం పలికారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, నూకాంబిక దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను, ఎన్టీఆర్ హాస్పిటల్ డైరెక్టర్ ఆళ్ల రామచంద్రరావు, జనసేన నాయకులు మంగ ఈశ్వర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరు హరి, భక్తులు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని మునగపాక, నాగులపల్లి గ్రామాలలో తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఇంద్రద్యుమ్న న హాలులో వివిధ అవతారాలలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చాడు. చివరి రోజున జగన్నాథుని మారు రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో వీధుల గుండా గంటలు మోగిస్తూ రథయాత్రలో పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో జగన్నాథ స్వామి నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. కళ్యాణోత్సవాలలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలి ఏకాదశి పురస్కరించుకొని స్వామివారి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

టిడిపి సంస్థాగత బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -చోడవరం : సంస్థాగతంగా పార్టీని బలోపేతానికి శ్రమించిన వారికే పదవులు వరిస్తాయని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఆదివారం చోడవరంలో పార్టీ కార్యకర్తలు నాయకులతో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అభివద్ధిని గ్రామాల్లో వివరించాలన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరి పనితీరును పార్టీ అధిష్టానం గమనిస్తోందన్నారు. కార్యక్రమంలో సంస్థగత ఎన్నికల పరిశీలకులు గొంప కృష్ణ, ఎన్నికల నియోజకవర్గ, మండల ఇన్‌ఛార్జిలు నాలుగు మండలాల మండల పార్టీ అధ్యక్షుడు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఎట్టకేలకు సర్వేయర్ నియామకం

ప్రజాశక్తి-బుచ్చయ్య పేట : మండలంలో ఎట్టకేలకు పూర్తిస్థాయి డిప్యూటీ సర్వేయర్‌ను నియమించారు. కొన్నాళ్లుగా రెగ్యులర్ సర్వేయర్ లేకపోవడంతో మండల వాసులు ఇబ్బందులు పడిన నేపథ్యంలో మండల డిప్యూటీ సర్వేయర్‌గా ఎ.శ్రీనివాసరావు ఆదివారం విధుల్లో చేరారు. అనంతరం తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


గ్రామ దేవతలకు ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలో మల్లవరం గుర్రప్ప ఆలయాన్ని, మడుతూరు చింతాలమ్మ ఆలయాన్ని ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సందర్శించి, ప్రత్యేకమైన పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు పి వాసు, ఎం.సంజీవ్, ఎం.శ్రీవేణి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల జాబితా నిర్వహణ శిక్షణ

ప్రజాశక్తి-వేపగుంట : ఎన్నికల జాబితా నిర్వహణ శిక్షణను బూత్ లెవెల్ ఆఫీసర్లకు సోమవారం నుంచి పెందుర్తిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తహశీల్దార్ కార్యాలయం ఒక ప్రకటన విడుదలచేసింది. బ్యాచ్‌కు 50 మంది చొప్పున ఆరు బ్యాచ్‌లుగా శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 7, 8, 9, 10, 11 మరియు 14 తేదీల్లో బిఎల్ఒలకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టండి



ఎమ్మెల్యే సుందరపును కలిసిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : సెజ్‌లోని ఫార్మాపరిశ్రమల్లో వరుస ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి తనకాల అనంతరావు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంవిఆర్ రాహుల్ కోరారు. ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను అచ్యుతాపురంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈసందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రెండు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన అచ్యుతాపురం, అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా సాగడంపై ఎమ్మెల్యేను ప్రశంసించారు. రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచాలని కోరారు.

కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు

నెలరోజుల పాటు నిర్వహణకు కమిటీ నిర్ణయం



ఉత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ, భక్తుల కమిటీ

ప్రజాశక్తి-. అనకాపల్లి : మండలంలోని సత్యనారాయణ పురం కళ్యాణగిరి కనకదుర్గమ్మ ఆలయంలో రానున్న శ్రావణమాసంలో నెలరోజులు పాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించాలని ఆలయ కమిటీ, భక్త మండలి, గ్రామ ప్రతినిధులు, భక్తుల కమిటీ నిర్ణయించింది. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉత్సవాల్లో కోటి కుంకుమ పూజలు, భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేయాలని నిర్ణయించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోటిపల్లి వెంకటరమణ కిషోర్, అధ్యక్షులు యడ్ల తినాధరావు, గౌరవ అధ్యక్షులు మేడిశెట్టి రామ సత్యనారాయణ (సత్తిబాబు), ధర్మకర్త బొయిన రమణాజీ, ముఖ్య సలహాదారులు పలక సత్యనారాయణ, అన్నదానం కమిటీ చైర్మన్ దుడ్డు శ్రీనివాసరావు, కన్వీనర్ కరణం సింహాద్రి నాయుడు, కోశాధికారులు పోతల రమణ, రాయపురెడ్డి రామచంద్రరావు పాల్గొన్నారు. కాగా ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు, అర్చకులు పులకండం రంగనాథ ఆచార్యులు, రేజేటి గోపాల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

పలు గ్రామాల్లో 'సుపరిపాలనకు తొలి అడుగు'



బుచ్చయ్యపేటలో ఇంటింటి ప్రచారంలో టిడిపి నేతలు

ప్రజాశక్తి-గాజువాక : జీవిఎంసి 74వ వార్డులో సుపరిపాలన తొలి అడుగులో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ తప్పకుండా అమలుచేస్తామని చెప్పారుకార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, పల్లా రమణ, వియ్యపు కొండబాబు, కోనరాజు, కరణాడ రామకృష్ణ, కోన రమణ పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : జీవిఎంసి 84వ వార్డు పిల్లా వారి వీధిలో టిడిపి వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, అర్హులై ఉండి లబ్ది అందకుంటే తెలియజేయాలని ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిళ్లా తారకేశ్వరరావు, కాండ్రేగుల జగదీష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారులు అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు, ఎలమంచిలి నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి సాయికృష్ణ, గ్రామ సర్పంచ్ పెరగడము భాగ్యలక్ష్మి బాపు నాయుడు, రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు పీలా తులసీరామ్, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ దొక్కా నాగభూషణం, ఎస్ శివ బాబు నాయుడు, కర్రి ఆదిబాబు, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు. పూడిమడక లో మాజీ ఎంపీటీసీ సభ్యుడు మెరుగు బాపు నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి సుపరిపాలన ప్రచారం చేశారు.

చోడవరం :మండలంలోని బెనవోలు, తిమ్మన పాలెం, రామ జోగి పాలెం, చాకిపల్లి గ్రామాలలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలనివిజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కనిపెట్టి సన్యాసిరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గౌరీ శంకర్, మాజీ ఎంపిపి జి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి, అగ్రహారం శివారు ఉప్పరగూడెంలో స్థానిక నాయకులు గుర్రం నూకరాజు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు.. మాజీ ఉపసర్పంచ్ గుర్రం లక్ష్మి బూత్ కన్వీనర్ గుర్రం చిన్న పాపారావు, గుర్రం రామకృష్ణ, నక్క రామకృష్ణ, నక్క దొంగబాబు, గుర్రం దేముడుబాబు, సాదరబోయిన రాంబాబు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని అరబుపాలెం, ఒంపోలు గ్రామాలలో సుపరిపాలనకు తొలిఅడుగులో యలమంచిలి టిడిపి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరావు , రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ పాల్గొని ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిపైవివరించారు. గడచిన ఐదేళ్ల వైసిపి పాలనలో విధ్వంసం నుంచి కూటమి పాలనలో వికాసం వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నడిపిస్తున్నారన్నారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, టిడిపి మండలఅధ్యక్షులు పెంటకోట విజయ్, దొక్కా నాగ భూషణం, ఉల్లింగల గోవింద్ , ఉల్లింగల సంతోష్ , దొడ్డి బుజ్జి, రౌతు నాగప్పరావు పాల్గొన్నారు.



మునగపాకలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న టిడిపి నేతలు

మాడుగుల: మండలంలోని ఎం. కోటపాడు గ్రామంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్రకార్యదర్శి మనవాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ జల్లి సూర్యప్రకాష్, గ్రామ శాఖ అధ్యక్షులు పిల్ల గంగనాయుడు, గండేపల్లి వెంకటరమణ, గుమ్మాల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదానికి విస్తృత ప్రచారం

-పలు చోట్ల జాతాలు, సమావేశాలు


గొలుగొండలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాంబిల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా , ఈనెల 9న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం పిలుపునిచ్చారు ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో మండలంలో వివిధ గ్రామాలలో ఆటోజాతా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేవిగేట్ వద్ద సమావేశంలో లోకనాథం మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేసే లేబరు కోడ్‌లను రద్దుచేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు, పంటలకు గిట్టుబాటు మద్దతు ధర, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, అసంఘటి రంగాల కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఉపాధి కూలీలకు, ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని, రోజు కూలి రూ.600 చెల్లించాలని, మోటార్ కార్మికులకు నష్టం చేసే జిఒ 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, జి దేవుడు నాయుడు, సిఐటియు నాయకులు, రామకృష్ణ, నారాయణరావ్, ధోని కాసియ్యా, భాస్కరరావు పాల్గొన్నారు.

కశింకోట : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానంలో మోటారుకార్మికుల జీవనం దుర్భరమౌతోందని సిఐటియు జిల్లానాయకులు దాకారపు శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 9న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ కె. నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ కె..లోవరాజు, కార్యదర్శి జె.సన్యాసినాయుడు, ట్రెజరర్ బి. శివ, నారాయణరావు, సిహెచ్, శ్రీనివాసరావు, రమణ, ఆనంద్ కుమార్, ఎం. శ్రీనివాసరావు, కె.రాఘవేంద్ర ఆటో కార్మికులందరూ పాల్గొన్నారు.


నర్సీపట్నంలో...

వడ్డాది/ బుచ్చయ్యపేట : జాతీయ సమ్మె జయప్రదం చేయాలని వడ్డాది, బుచ్చియ్యపేట, బంగారు మెట్ట, విజయరామరాజుపేట గ్రామాల్లో సిఐటియు ప్రచార జాతా నిర్వహించారు. సిఐటియు నాయకులు ఎస్వీ నాయుడు, సోమిరెడ్డి నాయుడు, పంచాయతీ కార్మికులు మోట ఆటో భవననిర్మాణ కార్మికులు, చంద్రశేఖర్, విజయ్ కుమార్, ఏసురాజు, శ్రీను, ముత్యాలు పాల్గొన్నారు

కె. కోటపాడు : 9న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు కోరారు. ఆదివారం మండలంలోని చౌడువాడ, గుల్లేపల్లి. గండు పాలెము. కే కోటపాడు. సూ రెడ్డిపాలెం. ఏ కోడూరు. వారాడ. వి సంత పాలెము. అనంతపురం గ్రామాలలో ఆటో ప్రచారజాతా నిర్వహించారు. సిఐటియు మండల నాయకులు ఈ నాయుడుబాబు, ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు,. రైతు సంఘం మండల కార్యదర్శి వనము సూర్యనారాయణ., అంగనవాడి కార్యకర్తలు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


కొమ్మాదిలో...

దేవరాపల్లి : జాతీయసమ్మె జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని కాశీపురం దేవరాపల్లి మారేపల్లి, తెనుగుపూడి, వెంకటరాజుపురం, వాకపల్లి గ్రామాల్లో ఆటో ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు గండినాయనబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి వెంకన్న, సిఐటియు నాయకులు రొంగలి దేముడు నాయుడు, బిటిదొర, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: ఈనెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఐద్వా నేతలు పిలుపునిచ్చారు. నర్సీపట్నంలో సమ్మె పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగడ్ల రాజు మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్ పరం చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

గొలుగొండ: ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు నాయకులు ఈరెల్లి చిరంజీవి పిలుపునిచ్చారు. ఆదివారం గొలుగొండ మండలంలో సమ్మె విజయవంతం చేయాలంటూ ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


బుచ్చయ్యపేటలో...

రావికమతం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే.గోవిందరావు, సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వజ్రపు సత్యవతి పిలుపునిచ్చారు. మండలంలో మేడివాడ, టిఅర్జాపురం, కొత్తకోట కేంద్రాలలో సమ్మె నేపథ్యంలో ఆదివారం జీపు జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.మహిళా సంఘం మండల కార్యదర్శి బి.సత్యవతి, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శివాసు, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

తగరపువలస : ఈ నెల 9వ తేదీన జరుగు జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక జిఆర్.భవన్‌లో యూనియన్ నాయకులు, సభ్యుల సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులు కొండపు ఈశ్వర రావు సమ్మె ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, సిహెచ్.నరసింహులు పాల్గొన్నారు.

కొమ్మాది : సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కొమ్మాది కూడలి నుండి కార్ షెడ్ మీదుగా తిరిగి కొమ్మాది వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు, నాయకులు పి.రాజుకుమార్, ఎస్.రామప్పడు, డి.సూరిబాబు, జి.కిరణ్, సిహెచ్.శేషుబాబు, బి.రాంబాబు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో..

నేటి నుండి పశు గ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి- మాడుగుల: మాడుగుల పశు వైద్య శాల పరిధిలో మాడుగుల, చీడికాడ మండలాలలోని గ్రామాలలో ఈనెల 7 నుండి 14 వరకు పశు గ్రాస వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పాడి రైతులకు సబ్సిడీ పై పశు గ్రాస విత్తనాలు పంపిణీ చేసి, మేలైన పశు గ్రాసాలతో కలిగే లాభాలను వివరిస్తారని తెలిపారు. రైతులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మెలకువలు తెలుసుకోవాలని కోరారు.


గిరి ప్రదక్షిణంలో పాల్గొన్న భక్తులు

ఉపమాకలో వైభవంగా గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-నక్కపల్లి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలో ఉపమాకలో వెంకన్న గిరి ప్రదక్షిణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీనివాస భజన సమాజం బృందం సభ్యులు ఆలపించిన భజన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి.ఆలయ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ రేవతమ్మ

గంజాయితో జీవితాలు చిన్నాభిన్నం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ :మండలంలోని ఎరకన్న పాలెం గ్రామంలో గంజాయి దుష్ప్రభావాలు, సైబర్ మోసాలు, శక్తి యాప్‌పై రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. రూరల్ ఎస్ఐ రాజారావు పాల్గొన్నారు. గంజాయి వినియోగంతో వ్యక్తిగత జీవితం, కుటుంబం చిన్నాభిన్న అవుతుందన్నారు.సైబర్ మోసాలు, అలాగే మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై, ఓటీపీ మోసాలు, ఫేక్ లోన్ యాప్‌లు, తదితర మోసాలపై వివరించారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-పాయకరావుపేట: భారత మాజీ ఉప ప్రధాని, దళిత, పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి ఆదివారం మండలంలోని అరట్లకోట ఎస్సీ కోలనీలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కుందూరు కుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్టా శ్రీను, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తుమ్మల గణేష్ పాల్గొన్నారు.

సీతమ్మధార : బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సిబ్బంది నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు బి.రామచంద్రప్రసాద్, బి.అశోక్‌కుమార్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విశాఖ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం కృష్ణా కాలేజీ రోడ్డులోగల వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ ఎస్‌సి విభాగం జిల్లా అధ్యక్షులు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. పార్టీ సమన్వయకర్తలు మళ్ల విజయ ప్రసాద్, మొల్లి అప్పారావు, పర్యవేక్షకులు రవి రెడ్డి, జహీర్ అహ్మద్, అనిల్ కుమార్ రాజు, కార్పొరేటర్లు రెయ్యి వెంకట రమణ, బిపిఎన్ కుమార్ జైన్, మహిళా విభాగం నాయకులు పేడాడ రమణి కుమారి పాల్గొన్నారు.


పాయకరావుపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు


ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో నిర్వాసితులకు అన్యాయం

సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో అమలాపురం పంచాయతీ పాటిమీద గ్రామంలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఇల్లులు కోల్పోతున్న నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపులో తీవ్ర అన్యాయం జరుగుతుందని, 2013 భూసేకరణ చట్టాన్ని అధికారులు ఉల్లంఘిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వాసితులతో కలిసి మాట్లాడారు. ఇక్కడ ఇల్లులు కోల్పోతున్న కుటుంబాల్లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అర్హత ఉన్నప్పటికీ జాబితాలో అర్హుల పేర్లు నమోదు చేయకుండా అధికారులు నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. నిర్వాసితుల కుటుంబాల్లో యజమాని పేరు మీద కోల్పోతున్న ఇంటికి నష్టపరిహారం చెల్లించి, వారి కుటుంబంలో అర్హత కలిగిన మనవళ్ళు, మనవరాళ్ళకు ప్యాకేజీ రాదని అధికారులు ఎండార్స్మెంట్లు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టంలో కుటుంబ అనే నిర్వచనం ప్రకారం నివాసం కోల్పోతున్న కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరినీ బాధితులుగా గుర్తించి ప్యాకేజీ ఇవ్వాలని చాలా స్పష్టంగా పొందిపరచడం జరిగిందన్నారు. అధికారులు 2013 భూసేకరణ చట్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, చట్టాన్ని ధిక్కరించి నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. చట్టాలను ధిక్కరిస్తున్న అధికారులపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, నానాజీ, కుమార్, బాబ్జీ, చిన్ని, ప్రసాద్, రామగణేష్, హేమలత, చిన్నమ్మలు పాల్గొన్నారు.



నిర్వాసితులతో కలిసి మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు



సాధారణ దుస్తులతో హాజరైన విద్యార్థులు

విద్యార్థులకు అందని
దుస్తులు, బూట్లు, బెల్టులు, బ్యాగులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో నేటికీ విద్యార్థులకు ఏకరూపదుస్తులు, బూట్లు, బెల్టులు, బ్యాగ్స్ అందలేదు. దీంతో విద్యార్థులు సాధారణ దుస్తులతో పాఠశాలలకు హాజరవుతున్నారు. పాఠశాలలో మొదలుపెట్టి దాదాపు నెల రోజులు కావస్తున్నా నేటికీ కేవలం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మాత్రమే అందజేశారు. మండల వ్యాప్తంగా 52 పాఠశాలలకు గాను 2,600 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

ఈ విషయంపై ఎంఈఓ రామారావును వివరణ కోరగా ఏకరూప దుస్తులు అందుబాటులోనే ఉన్నాయని, విద్యార్థులకు అందజేసే బ్యాగులు చిన్న సైజు రావడంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని బెల్టులు, బూట్లు కూడా వాటితో పాటు అందజేస్తామని అన్నారు.

చెరువులను తలపిస్తున్న కార్యాలయాలు



బురదగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు



ఎంపిడిఒ కార్యాలయానికి వెళ్లే రోడ్డు



పౌర సరఫరాల గిడ్డంగి రోడ్డు

ప్రజాశక్తి -కోటవురట్ల: గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కార్యాలయాల వద్ద రహదారులు బురదమయంగా దర్శనమిస్తున్నాయి. దీంతో కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సబ్ ట్రెజరీ కార్యాలయం, పౌరసరఫరాల గిడ్డంగికి వెళ్లే రహదారి, సబ్ రిజిస్టర్ ఆఫీస్ కు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు మండల పరిషత్తు కార్యాలయం వద్ద చెరువును తలపించేలా ఉండే ప్రధాన రహదారి వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న గుడివాడ అమర్నాథ్

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

-వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్

ప్రజాశక్తి-రోలుగుంట: వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్ని ఇబ్బందులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్నాధ్ పిలుపునిచ్చారు. ఆదివారం రోలుగుంటలో వైసిపి విస్తృత స్థాయి సమావేశం ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన అమర్నాధ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రతీ కార్యకర్త ప్రజలకు వివరించాలని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ అధికారమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికునిలా ఇప్పటి నుంచే పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి ఆదీప్‌రాజ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయరూ..

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం ఆర్ల, ఎంకే.పట్నం పంచాయతీ కొండశిఖల గ్రామాల్లో అసంపూర్తిగా వదిలేసిన రోడ్లను పూర్తి చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంపై సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆర్ల పంచాయతీ చెందిన వైబి.పట్నం నుండి లోసింగి మీదుగా పెద్దగరువు గ్రామానికి రెండు కోట్ల 60 లక్షల రూపాయలు బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆర్ల గ్రామం నుండి పిత్రిగడ్డ బిటి రోడ్డు నిర్మాణానికి నాలుగు కోట్ల 60 లక్షల ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేశారన్నారు. ఎంకే పట్నం పంచాయతీ కేంద్రం నుండి కొరుప్రోలు గ్రామం వరకు రెండు కోట్ల 50 లక్షల రూపాయలు ఉపాధి హామీ పథకం ద్వారా గ్రావెల్ రోడ్డు నిధులు మంజూరు చేశారని చెప్పారు. కొండ శిఖర కొందు ఆదివాసి గిరిజన గ్రామాలకు మొత్తం 9కోట్ల 60 లక్షలు మంజూరు చేశారన్నారు. వైబి పట్నం నుండి లోసింగి మధ్యలో వరకు మార్చి నెలలోనే ఎర్త వర్క్ పూర్తి చేసి సబ్ బేస్ వేశారని, అర్ల నుండి పిత్రి గడ్డ రోడ్డుకి కూడా జిఎస్‌బి వేశారన్నారు. రోడ్డు నిర్మాణానికి 2 కోట్ల 82,530 రూపాయలు రోడ్డు నిర్మాణానికి ఖర్చు పెట్టారని, అప్పటినుండి ఇప్పటివరకు రోడ్డుకి ఖర్చు పెట్టిన నిధులు రాకపోవడంతో ప్రభుత్వం బకాయిలు చెల్లించక పోవడంతో రోడ్డు అసంపూర్తిగా వదిలేశారని వివరించారు. భారీ వర్షాలకు రోడ్లన్నీ మరింతగా అధ్వాన్నంగా మారాయన్నారు. ఇటీవల జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు, తహశీల్దార్ నాగమ్మ లోసింగి గ్రామానికి కాలినడకన వెళ్లారని గుర్తు చేశారు. వెంటనే అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని, లేకుంటే జిల్లా డోలిల ద్వారా ఆందోళన చేస్తామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, పివిటిజి సంఘం డివిజన్ అధ్యక్షులు గెమ్మిలి వాసు తెలిపారు.



అసంపూర్తిగా ఉన్న రోడ్డు



విరాళం అందజేస్తున్న దేవరాజు

ఏచూరి భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిపిఎం పూర్వ అఖిల భారత ప్రధాన కార్యదర్శి, అమరజీవి సీతారాం ఏచూరి పేరిట దేశంలో ప్రథమంగా విశాఖలోని మద్దిలపాలెంలో నిర్మితమవుతున్న సిపిఎం విశాఖ జిల్లా నూతన కార్యాలయానికి విశ్రాంత ఉద్యోగి ఆర్.దేవరాజు రూ.5 వేలు విరాళమిచ్చారు. భవన నిర్మాణం త్వరగా పూర్తై ప్రజా ఉద్యమాలకు అందుబాటులోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. దేవరాజుకు పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాస్, సీనియర్ నాయకులు కెఎం.కుమార మంగళం అభినందనలు తెలిపారు.



ఒప్పంద పత్రాలతో ప్రతినిధులు

పెంటగాన్ రగ్డ్ సిస్టమ్స్‌తో హెచ్ఎస్ఎల్ ఎంఒయు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) అత్యాధునిక యాంటీ డ్రోన్ వ్యవస్థలను నావికాదళ నౌకలపై అత్యాధునిక సాంకేతికతతో అనుసంధానించడానికిగాను పెంటగాన్ రగ్డ్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా పెంటగాన్ రగ్డ్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ ఎమ్‌డి డాక్టర్ స్వామినాథన్ మణికందన్, హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ చైర్మన్ అండ్ ఎమ్‌డి కమాండర్ హేమంత్ ఖత్రి ఒప్పందంపై సంతకాలు చేశారు. అనంతరం హేమంత్ ఖత్రి మాట్లాడుతూ సముద్ర భద్రతపై దృష్టిసారించామన్నారు. స్వామినాథన్ మణికందన్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ విశేషాలను తెలియజేశారు.